సాక్షి
అనంతపురం
మంగళవారం ၊ 21 ၊ మార్చి ၊ 2023



పంట నష్టం రూ. 94 కోట్లు

జిల్లాలో ఈదురుగాలులు, వడగండ్ల వానకు జరిగిన పంట నష్టం సోమవారం నాటికి రూ.94 కోట్లకు చేరుకుంది.



1,660 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

తుంగభద్ర జలాశయానికి సోమవారం 1,660 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. నీటిమట్టం 1,633 అడుగులకు గాను 1,594.20 అడుగులకు చేరుకుంది.

గరిష్టం/కనిష్టం
36.8°/17.2°

జిల్లాలో సోమవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం స్వల్పంగా పెరిగింది. ఆగ్నేయం దిశగా గాలులు గంటకు 8 నుంచి 12 కిలో మీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

రైతులను ఆదుకోవాలి



సీఎం వైఎస్ జగన్‌కు వివరిస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

శింగనమల: అకాల వర్షాలకు శింగనమల, గార్లదిన్నె, బుక్కరాయసముద్రం, నార్పల, పుట్లూరు, యల్లనూరు మండలాల్లో పంటలు దెబ్బతిన్న రైతులను ఆదుకోవాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి కోరారు. సోమవారం అసెంబ్లీ ఆవరణలో సీఎంను కలిసిన ఎమ్మెల్యే నియోజకవర్గంలో 3996 మంది రైతులు చేతికొచ్చిన పంటలను వర్షాల వల్ల నష్టపోయారని వివరించారు. నియోజకవర్గంలో వరి, మొక్కజొన్న, వేరుశనగ తదితర వ్యవసాయ పంటలు దాదాపు 4,996 ఎకరాలు, అరటి, చీనీ, మామిడి, సపోటా, టమాట తదితర ఉద్యాన పంటలు దాదాపు 3,222 ఎకరాల దాకా నష్టం వాటిల్లినట్లు తెలిపారు. బాధిత రైతులను ఆదుకునేందుకు సీఎం సానుకూలంగా స్పందించారు.

నిర్ణీత చార్జీనే వసూలు చేయాలి



అనంతపురం అర్బన్: ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు వంట గ్యాస్ సిలిండర్ డెలివరీకి వినియోగదారుల నుంచి నిర్ణీత చార్జీ వసూలు చేయాలని జిల్లా సరఫరాల అధికారి (డీఎస్‌ఓ) శోభారాణి గ్యాస్ ఏజెన్సీలను ఆదేశించారు. ఏజెన్సీ వ్యక్తులు సిలిండర్ డెలివరీకి నిర్ణీత చార్జీ మించి వసూలు చేస్తే టోల్ ఫ్రీ నంబర్లు 1906 లేదా 1967కు వినియోగదారులు ఫిర్యాదు చేయాలని సూచించారు. సిలిండర్లు నిల్వ చేసిన గోదాము నుంచి 5 కిలోమీటర్ల వరకు రవాణా చార్జీ ఉచితమని, 5 నుంచి 15 కిలోమీటర్ల వరకు రూ.20, 15 కిలోమీటర్లు దాటితే రూ.30 రవాణా చార్జీ కింద వసూలు చేయాలని తెలిపారు.

నేడు ఎస్కేయూ పాలకమండలి సమావేశం



అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ పాలకమండలి సమావేశం మంగళవారం నిర్వహించనున్నారు. పాలక భవనంలో జరిగే సమావేశానికి అందుబాటులో ఉన్న పాలకమండలి సభ్యులు నేరుగా పాల్గొంటారు. దూర ప్రాంతాల్లో ఉన్న వారు వర్చువల్‌గా అంశాలు చర్చించనున్నారు. జువాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీకాంత్, బోధనేతర ఉద్యోగులు పెద్దన్న, ముత్యాలప్ప, చంద్రబాబు లపై విధించిన సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని వర్సిటీ ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఇందుకు పాలకమండలి అనుమతి తీసుకోనున్నారు. రూసా (రాష్ట్రీయ ఉచ్చతార్ శిక్షా అభియాన్) కోఆర్డినేటర్, సైన్స్ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఉన్న ప్రొఫెసర్ జీవన్‌కుమార్ నెలాఖరులో ఉద్యోగ విరమణ చేయనున్నారు. ఈయన స్థానంలో కొత్త రూసా కోఆర్డినేటర్‌ను నియామకం చేయనున్నారు. ఇది వరకు ఉన్న ఆర్ట్స్, క్యాంపస్ సైన్స్ కళాశాలలను విలీనం చేసి ఒకే కళాశాలగా ఏర్పాటు చేయనున్నారు. ఒకే ప్రిన్సిపాల్‌ను నియామకం చేయనున్నారు. ఫిజిక్స్, ఎలక్ట్రానిక్స్ విభాగాలను విలీనం చేసి ఫిజిక్స్ విభాగంగా మార్పు చేయనున్నారు. ఇలా మొత్తం 50 అంశాలతో ఎజెండా రూపొందించారు.

నేటి నుంచి ఇంటర్ స్పాట్

రాప్తాడురూరల్: ఇంటర్మీడియెట్ పరీక్షలు జరుగుతుండగానే ఫలితాల విడుదలపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందులో భాగంగానే మూల్యాంకన ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. మంగళవారం నుంచి ఇంటర్ జవాబు పత్రాల మూల్యాంకనం (స్పాట్) ప్రారంభమవుతుంది. వివిధ జిల్లాలకు చెందిన సంస్కృతం ప్రశ్నపత్రాలు ఇప్పటికే అనంతపురం చేరాయి. ముందుగా సంస్కృతం జవాబుపత్రాల మూల్యాంకనం జరుగుతుందని ఆర్‌ఐఓ సురేష్‌బాబు తెలిపారు. ఇందుకోసం ఏడుగురిని చీఫ్ ఎగ్జామినర్లుగా, 35 మందిని అసిస్టెంట్ ఎగ్జామినర్లుగా నియమించామన్నారు. ఉత్తర్వులు అందుకున్న ప్రతి ఒక్కరూ విధిగా హాజరుకావాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. మధ్యాహ్నం 12.30 గంటలకు అనంతపురం కొత్తూరు బాలుర ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని మూల్యాంకనం కేంద్రానికి చేరుకోవాలని ఆయన సూచించారు.

ఉపాధితో ఉద్యానం

- పండ్ల తోటల్లో అంతర పంటలకు శ్రీకారం
- మునగతోపాటు పూల మొక్కల సాగుకు అవకాశం
- వచ్చే ఆర్థిక సంవత్సరంలో 4వేల ఎకరాల్లో పండ్ల తోటల పెంపకం
- ఏప్రిల్ మొదటి నుంచి దరఖాస్తుల స్వీకరణ



డ్రైల్యాండ్ హార్టికల్చర్ పథకం కింద సాగు చేసిన మామిడి తోట (ఫైల్)

అనంతపురం టౌన్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా డ్రైల్యాండ్ హార్టికల్చర్‌ను మరింత ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పండ్ల తోటల రైతులకు పైసా ఖర్చులేకుండా ఉపాధి నిధులతో అండగా నిలుస్తోంది.'అనంత'ను ఉద్యాన జిల్లాగా మార్చేందుకు ఏటా హార్టికల్చర్ విస్తీర్ణాన్ని పెంచుతోంది. అందులో భాగంగానే వచ్చే ఆర్థిక సంవత్సరం (2023-24)లో 4వేల ఎకరాలకు పైగా పండ్ల తోటల పెంపకం చేపట్టాలని లక్ష్యం నిర్దేశించింది. ఇందు కోసం ఐదెకరాల్లోపు మెట్ట భూములున్న రైతుల నుంచి డ్రైల్యాండ్ హార్టికల్చర్ పథకం కింద దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

అంతర పంటలకు శ్రీకారం

పండ్ల మొక్కల సాగుకు దరఖాస్తు చేసుకున్న రైతులకు అదనపు ఆదాయం సమకూర్చే విధంగా 2023-24 నుంచి నుంచి పండ్ల మొక్కలతోపాటు అంతర పంటగా మునగ, పూల మొక్కలు (కనకాంబరాలు, రోజా, జాస్మిన్)లో ఏదో ఒకటి అంతర పంటగా సాగు చేసుకునేందుకు వెసులుబాటు కల్పించారు. పండ్ల మొక్కలు సాగు చేసిన నాటి నుంచి పంట చేతికివచ్చేందుకు దాదాపు ఐదు సంవత్సరాల సమయం పడుతుంది. ఈ సమయంలో రైతు ఆర్థికంగా ఇబ్బంది పడకుండా అంతర పంటగా పూల తోటల సాగును ప్రోత్సహించేందుకు ప్రత్యేక కార్యచరణ చేపట్టింది. ఒక ఎకరా వరకు పూల సాగు చేసుకునే విధంగా అవకాశం కల్పించారు. అంతర పంటగా పూల తోటలు సాగు చేస్తే ఏడాది పొడవునా రైతుకు ఆదాయం సమకూర్చే దిశగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది.

9రకాల పండ్ల మొక్కలకు అవకాశం

ఉపాధి హామీ డ్రైల్యాండ్ హార్టిక్చర్ పథకంలో రైతుల నేల స్వభావాన్ని బట్టి తొమ్మిది రకాల పండ్ల మొక్కలు సాగు చేసుకునేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. అన్ని రకాల పండ్ల మొక్కల సాగుకు అనంతపురం జిల్లా అనువైన ప్రాంతం. దీంతో రైతులు సైతం పండ్ల మొక్కల సాగుకు ఆసక్తి చూపుతున్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి సాగు చేసేందుకు మామిడి, చీనీ, నిమ్మ, దానిమ్మ, తైవాన్ జామ, సపోట, డ్రాగన్ ఫ్రూట్, అల్లనేరేడు, అంజూర పండ్ల మొక్కలను ఎంపిక చేశారు. వీటిలో రైతులు ఏ పండ్ల మొక్కల సాగుపై ఆసక్తి ఉంటే వాటి కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. గుంతలు తవ్వే దగ్గరి నుంచి మొక్కలతోపాటు ఫర్టిలైజర్స్‌తో కలిపి పండ్ల మొక్కలను బట్టి ఎకరాకు దాదాపు రూ.80 వేల నుంచి రూ.లక్షదాకా ప్రభుత్వం ఖర్చు పెట్టనుంది. దీంతో పాటు అదనంగా మూడేళ్ల పాటు మొక్కలకు నీటిని పెట్టి సంరక్షించుకునేందుకు రైతుకు వాటర్ బిల్లును సైతం అందించనుంది.

> **ఏప్రిల్ నుంచి దరఖాస్తుల స్వీకరణ**
>
> 
>
> మెట్ట భూములున్న రైతులను ప్రోత్సహించడంలో భాగంగా ఈ ఏడాది 4వేల ఎకరాల్లో డ్రైల్యాండ్ హార్టికల్చర్ ఏర్పాటు చేసే దిశగా చర్యలు చేపట్టాం. పండ్ల మొక్కల సాగుపై ఆసక్తి ఉన్న రైతులు ఏప్రిల్ మొదటి వారం నుంచి దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించాం. ఐదు ఎకరాలలోపు మెట్ట భూమి ఉన్న రైతులు డ్రైల్యాండ్ హార్టికల్చర్ పథకానికి అర్హులు. అలాంటి రైతులు గ్రామాల్లోని ఫీల్డ్ అసిస్టెంట్లతో సంప్రదించి ఎంపీడీఓ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలి. తక్కువ విస్తీర్ణం ఉన్న రైతులు సైతం పూల మొక్కల సాగు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.
>
> – వేణుగోపాల్‌రెడ్డి, డ్వామా పీడీ

హత్య కేసులో ముద్దాయికి యావజ్జీవం



అనంతపురం: శింగనమల మండలం కల్లుమడి గ్రామానికి చెందిన నారాయణ స్వామి హత్య కేసులో ముద్దాయి పత్రా రామగోపాల్‌కు యావజ్జీవ కఠిన కారాగార శిక్ష విధిస్తూ ఏడో అదనపు జిల్లా సెషన్స్, ఫ్యామిలీ కోర్టు న్యాయమూర్తి డి.తిరుమలరావు సంచలన తీర్పు వెలువరించారు. వివరాలిలా ఉన్నాయి. నారాయణస్వామి 2021 ఫిబ్రవరి రెండో తేదీన పొలం పనులు ముగించుకుని కూలీలతో కలిసి ఇంటికి బయల్దేరాడు. ఇదే సమయంలో పక్కనే ఉన్న పత్తి చేనులో కాపుకాచి ఉన్న పత్రా రామగోపాల్ వేటకొడవలితో నారాయణస్వామిని విచక్షణారహితంగా నరికి చంపాడు. తన భార్యతో నారాయణస్వామికి వివాహేతర సంబంధం ఉందన్న అనుమానంతో రామగోపాల్ ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు. అప్పటి సీఐ భాస్కర్ గౌడ్ కేసు నమోదు చేసి.. ముద్దాయిపై కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసు విచారణలో భాగంగా అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాగరాజు బాబు (బాబ్జి) ప్రాసిక్యూషన్ తరఫున 13 మంది సాక్షులను విచారించారు. అనంతరం న్యాయమూర్తి తిరుమలరావు ఇరువర్గాల వాదనలు, కేసు పూర్వాపరాలను పరిశీలించిన మీదట.. నేరం రుజువైనందున ముద్దాయి పత్రా రామగోపాల్‌కు యావజ్జీవ కఠిన కారాగార శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు వెలువరించారు.

నేటి నుంచి విద్యార్థులకు రాగిజావ

- ఇప్పటికే పాఠశాలలకు చేరిన రాగిపిండి, పొడిబెల్లం
- జిల్లాలో 2,07,550 మంది విద్యార్థులకు లబ్ధి

రాప్తాడు రూరల్: సర్కారు పాఠశాలల విద్యార్థులకు మరింత బలవర్ధకమైన ఆహారం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా 'జగనన్న గోరుముద్ద' పేరుతో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకం మెనూలో అదనంగా రాగిజావను చేర్చారు. రాగిలో మాంసకృత్తులు అధికంగా ఉంటాయి. రాగిపిండిలో పలురకాల అమైనా ఆమ్లాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి ఒత్తిడి, ఆందోళనలను తగ్గిస్తాయి. అంతేకాదు కండరాల ఆరోగ్యానికి, రక్తం తయారవడానికి, జీవక్రియలు సాఫీగా జరగడానికి తోడ్పడతాయి. రాగుల్లో ఉన్న కాల్షియం పిల్లల ఎదుగుదలకు తోడ్పడతాయి. ఆలోచనా శక్తి మరింత పెరుగుతుంది. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు 'రాగిజావ' అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. రాగిజావ తాగేందుకు ప్రస్తుతం విద్యార్థులే ఇంటినుంచి గ్లాసులు తెచ్చుకోవాలి. రానున్న రోజుల్లో ప్రభుత్వం గ్లాసులను కూడా సరఫరా చేయనుంది.

జిల్లాలో లక్షల మంది విద్యార్థులకు లబ్ధి

వారంలో మూడు రోజులు మంగళవారం, గురువారం, శనివారం ప్రతి విద్యార్థికీ ఒక గ్లాసు రాగిజావను ఉదయం 8.45 గంటలకు అందించనున్నారు. అంటే చిక్కీలు ఇవ్వని రోజున ఈ రాగిజావ ఇస్తారు. మొత్తం మీద వారమంతా పిల్లలకు పౌష్టికాహారం అందనుంది. జిల్లాలో 1,203 ప్రాథమిక పాఠశాలల్లో1,11,499 మంది విద్యార్థులు, 202 ప్రాథమికోన్నత పాఠశాలల్లో 58,603 మంది విద్యార్థులు, 293 ఉన్నత పాఠశాలల్లో 37,448 మంది విద్యార్థులు కలిపి మొత్తం 2,07,550 లబ్ధి పొందనున్నారు. రాగిజావకు అవసరమైన రాగిపిండి, పొడిబెల్లం ఇప్పటికే ప్రభుత్వ చౌకధాన్యపు దుకాణాల ద్వారా ఆయా పాఠశాలలకు చేర్చారు.

నేడు ముఖ్యమంత్రి చేతుల మీదుగా...

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా మంగళవారం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ నుంచి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కానున్నారు.

> **ప్రతి పాఠశాలలో రాగిజావ ఇవ్వాల్సిందే**
>
> జిల్లాలోని ప్రతి ప్రభుత్వ పాఠశాలలోనూ విద్యార్థులకు రాగిజావ ఇవ్వాల్సిందే. రాగిజావ తయారు చేసేవారు ప్రత్యేక శ్రద్ధతో జాగ్రత్తలు తీసుకోవాలి. ఇప్పటికే అన్ని పాఠశాలలకు రాగిపిండి, పొడిబెల్లం సరఫరా చేశాం. ఏదైనా సాంకేతిక కారణాల వల్ల అరకొర స్కూళ్లకు అందకపోయినా పక్క స్కూళ్ల నుంచి సర్దుబాటు చేసుకోవాలి. వారికి స్టాకు వచ్చిన తర్వాత తిరిగి ఇచ్చేయాలి. అంతేకానీ బయట కొనుగోలు చేయకూడదు. ప్రస్తుతానికి విద్యార్థులే ఇళ్ల నుంచి గ్లాసులు తెచ్చుకోవాలి. త్వరలో ప్రభుత్వం గ్లాసులను సరఫరా చేస్తుంది. – ఎం. సాయిరాం డీఈఓ

వైద్యుల పాత్ర కీలకం



ప్రొఫెసర్లతో మెడికోలు



స్టెప్పులు వేస్తున్న విద్యార్థినులు

- ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి
- ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి
- మెడికల్ కాలేజీలో సంబరంగాఫ్రెషర్స్ డే

అనంతపురం సప్తగిరి సర్కిల్: ఆరోగ్యకరమైన సమాజాన్ని నెలకొల్పడంలో వైద్యుల పాత్ర కీలకమని అనంతపురం ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవి అన్నారు. మెడికల్ కళాశాల ఆడిటోరియంలో సోమవారం 2022 మెడికోల ఫ్రెషర్స్ డే కార్యక్రమాన్ని 2020 బ్యాచ్‌కు చెందిన మెడికోల ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ప్రిన్సిపాల్‌తో పాటు సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఘునందన్, సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ షారోన్ సోనియా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాణ్యమైన వైద్య సేవలను అందించడం ద్వారా ప్రజల్లో ప్రత్యేక గుర్తింపు పొందవచ్చన్నారు. ప్రాణాలు నిలిపే దేవుడుని దేవుడితో సమానంగా చూస్తారని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన అవసరం వైద్యులందరిపైనా ఉందన్నారు. అనంతరం నూతనంగా చేరిన విద్యార్థులకు ఐడెంటిటీ కార్డులను, వివిధ పోటీల్లో ప్రతిభ చాటుకున్న వారికి మెడల్స్, ప్రశంసాపత్రాలను అందజేశారు. అనంతరం వైద్య విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రభుత్వ మెడికల్ కళాశాల అధ్యాపకులు డాక్టర్ నవీద్ అహమ్మద్, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ శైలజ, డాక్టర్ నిహారిక, డాక్టర్ శ్యాంప్రసాద్, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ అబ్దుల్ మజీద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పరదేశినాయుడు తదితరులు పాల్గొన్నారు.



ఫ్రెషర్స్ డేలో పాల్గొన్న విద్యార్థులు

ఆధార్ 'నవీకరణ' తప్పనిసరి

- అప్‌డేట్ చేసుకోకుంటే ఆధార్ సస్పెండ్
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు దూరం



ఆధార్ కార్డులు



ఆధార్ అప్‌డేషన్ కోసం ఐరిస్ తీసుకుంటున్న సచివాలయ డిజిటల్ అసిస్టెంట్

అనంతపురం అర్బన్: ప్రతి ఒక్కరికీ అత్యంత ముఖ్యమైనది ఆధార్ కార్డు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందాలన్నా.. బ్యాంక్ ఖాతా తెరవాలన్నా.. లావాదేవీలు జరపాలన్నా.. పాస్‌పోర్ట్ పొందాలన్నా... ఇలా ప్రతి చోటా ఆధార్ అవసరం ఉంటోంది. అయితే ఆధార్ వచ్చిన కొత్తలో డాక్యుమెంట్లు తీసుకోకుండా యూనిక్ ఐడీ ఇచ్చేశారు. ఇప్పుడు అన్నింటికీ ఆధార్ అనుసంధానిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆధార్‌ను తప్పనిసరిగా నవీకరణ (అప్‌డేట్) చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. డాక్యుమెంట్ అప్‌డేట్ చేసుకోని వారందరి ఆధార్‌లు ఈ ఏడాది ఆగస్టు తర్వాత సస్పెండ్ అవుతాయని స్పష్టం చేసింది.

ప్రత్యేక శిబిరాలు

ఆధార్ అప్‌డేషన్‌కు సంబంధించి ప్రభుత్వం సచివాలయాల్లోనే కేంద్రాలను అందుబాటులోకి తెచ్చింది. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 79 సచివాలయ కేంద్రాల్లో ఆధార్ నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. నామమాత్రపు రుసుంతో ఆధార్ అప్‌డేట్ చేసుకోవచ్చు. ఇందు కోసం ఈ నెల 21, 27, 28, 29 తేదీల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నారు. అధికారిక లెక్కల ప్రకారం జిల్లాలో 11,32,391 మంది ఆధార్‌లో వివరాలను అప్‌డేట్ చేసుకోవాల్సి ఉంది. నవీకరణ ప్రక్రియను ఎంపీడీఓలు, మునిసిపల్ కమిషనర్లు పర్యవేక్షించాల్సి ఉంటుంది. ఈ మేరకు ప్రభుత్వం నుంచి జిల్లా అధికారులకు ఉత్తర్వులు అందాయి.

అప్‌డేట్ ఎందుకు చేసుకోవాలంటే..

- కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆధార్ కలిగి ఉన్న ప్రతిఒక్కరూ తమ ఆధార్‌లో వివరాలను అప్‌డేట్ చేసుకోవాలి.
- 2010 నుంచి 2016వ సంవత్సరం వరకు ఆధార్ మంజూరు చేసేటప్పుడు ఎలాంటి డాక్యుమెంట్లూ తీసుకోలేదు. ఈ క్రమంలో బోగస్ ఆధార్ కార్డులు పెరిగి పోయాయి. వీటిని ఏరివేసే ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం చేపట్టింది. ఆధార్ కార్డు ఉన్న పౌరులు తమ పేరు, చిరునామా, సరైన ఆధారాలతో ధ్రువీకరించుకోవాలి.
- 2010 నుంచి 2016 మధ్య ఆధార్ తీసుకుని 2016 తర్వాత ఆధార్‌లో పేరు, చిరునామా మార్చుకోని వారు తప్పనిసరిగా తమ డాక్యుమెంట్ అప్‌డేట్ చేసుకోవాలి.
- 2016 తర్వాత ఫొటో, జనన తేదీని మార్చుకున్నప్పటికీ.. చిరునామా మార్చుకోని వారు డాక్యుమెంట్ అప్‌డేట్ చేసుకోవాల్సిందే. లేదంటే ఆధార్ సస్పెండ్ అవుతుంది.
- ఆధార్ సస్పెండ్ అయితే ఆధార్‌తో లింక్ అయిన మొత్తం అన్ని సేవలూ నిలిచిపోతాయి. బ్యాంకింగ్, పోస్టల్, గ్యాస్ తదితర సర్వీసులు ఆగిపోతాయి. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల నుంచి అందుతున్న సంక్షేమ పథకాల లబ్ధి కూడా ఆగిపోతుంది.
- ఆధార్ కార్డులో ఉన్న చిరునామా, ప్రస్తుత చిరునామా వేరుగా ఉంటే సరైన ఆధారాలతో చిరునామా అప్‌డేట్ చేయించుకోవాలి.
- వివాహానికి ముందు ఆధార్‌లో మహిళలకు పుట్టింటివారి ఇంటిపేరు ఉంటుంది. వివాహం తర్వాత భర్త ఇంటి పేరుతో ఆధార్ తీసుకోవాలంటే సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం మంజూరు చేసిన మ్యారేజ్ సర్టిఫికెట్ సమర్పించాల్సి ఉంటుంది.

> **అప్‌డేట్ చేయించుకోండి**
>
> 
>
> ఆధార్ కార్డులోని వివరాలను తప్పనిసరిగా అప్‌డేట్ చేయించాలి. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఆధార్ అప్‌డేట్ చేసుకోకపోతే సస్పెండ్ అవుతుంది. అదే జరిగితే చాలా ఇబ్బందిపడాల్సి వస్తుంది. ప్రభుత్వ పథకాలు అందవు. బ్యాంకింగ్, తదితర సర్వీసులు నిలిచిపోతాయి. కాబట్టి ప్రతి ఒక్కరూ నిర్దేశిత గడువులోపు ఆధార్ కార్డులను అప్‌డేట్ చేసుకోవాలి. అప్‌డేషన్ కోసం ఈ నెల 21, 27, 28, 29 తేదీల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహించనున్నారు. ఈ ప్రక్రియను ఎంపీడీఓలు, మునిసిపల్ కమిషనర్లు పర్యవేక్షిస్తారు.
>
> – గాయత్రీదేవి, డీఆర్‌ఓ, అనంతపురం

శ్రీధరన్ కోసం వేట

- అనంతపురం నుంచి రెండు బృందాలు కేరళకు
- పోలీసులతో పాటు నలుగురు నిందితులు కూడా..
- కేరళ పోలీసులూ రంగంలోకి దిగిన వైనం
- హవాలా సొమ్ము దోపిడీలో ఆరితేరిన శ్రీధరన్

సాక్షి ప్రతినిధి, అనంతపురం : 'హవాలా' సొమ్మును దోచుకోవడంలో ఆరితేరిన అంతర్రాష్ట్ర ముఠా నేత శ్రీధరన్ కోసం పోలీసులు జల్లెడ పడుతున్నారు. గత నెలలో బెంగళూరు జాతీయ రహదారిపై హవాలా సొమ్ము దోపిడీ జరిగింది. పోలీసులు పక్కా సమాచారంతో ఈ కేసులోని నలుగురు నిందితులను పట్టుకుని, రూ.1.89 కోట్ల సొమ్ము స్వాధీనం చేసుకున్నారు. అయితే కీలక నేరస్తుడు శ్రీధరన్ కోసం ఇప్పుడు 'అనంత' పోలీసులు పది మంది రెండు బృందాలుగా ఏర్పడి కేరళకు వెళ్లారు. వీరితో పాటు ఇదివరకే అదుపులోకి తీసుకున్న నలుగురు నిందితులను కూడా వెంటబెట్టుకుని వెళ్లారు. దక్షిణాదిలోని అన్ని రాష్ట్రాల్లోనూ శ్రీధరన్‌పై హవాలా సొమ్ము దోపిడీ కేసులు ఉన్నాయి.

ఇన్‌ఫార్మర్ల వ్యవస్థతోనే...

శ్రీధరన్ అంటే దక్షిణాది రాష్ట్రాల్లో హవాలా వ్యాపారం చేసే వారికి తెలియకుండా ఉండదు. వారు ఎంత ఆచితూచి అడుగులు వేసినా శ్రీధరన్ నుంచి తప్పించుకోలేరు. ప్రతి హవాలా వ్యాపారి వద్ద శ్రీధరన్ ఇన్‌ఫార్మర్లను ఏర్పాటు చేసుకుంటారు. మూడో కంటికి తెలియకుండా సొమ్ము ఎక్కడికి వెళుతుందో శ్రీధరన్‌కు ఇన్‌ఫార్మర్లు చేరవేస్తారు. దీంతో తక్షణమే వ్యూహం సిద్ధం చేసి తన మనుషులను రంగంలోకి దించుతారు. జాతీయ రహదారుల్లో మాత్రమే పక్కాగా వ్యూహం అమలు చేసి 'హవాలా' సొమ్మును దోచుకుని.. పోలీసులకు చిక్కకుండా పారిపోతారు.

రూ.2 కోట్లపైన అయితేనే..

శ్రీధరన్ చిన్నా చితకా దోపిడీలు చేయడు. సమాచారం పక్కాగా ఉండాలి. అందులోనూ 'హవాలా' సొమ్ము రూ.2 కోట్ల పైన ఉంటేనే రంగంలోకి దిగుతాడు. అధికారిక సొమ్మును ఎవరు తీసుకెళుతున్నా వారి జోలికి వెళ్లడు. 'హవాలా' సొమ్ముపై మాత్రమే కన్నేస్తాడు. ఎందుకంటే ఈ సొమ్ము దోచుకుంటే కేసులు నమోదు కావు కాబట్టి. ఒక్కసారి శ్రీధరన్ కన్ను పడిందంటే ఆ సొమ్మును దోచుకునే వరకూ వదలడు. నాలుగైదు బృందాలు ఇన్నోవా వాహనాల్లో నిఘావేసి ఏ అర్ధరాత్రో దోచుకెళ్తారు. దోచుకున్న సొమ్ము ఎప్పుడు ఏ వాహనంలో ఎక్కడికి వెళుతుందో పోలీసులు నిఘా వేయనంతగా జాగ్రత్త పడతాడు. ఈ సొమ్మును కోయంబత్తూరు, సేలం, తిరువనంతపురం వంటి ప్రాంతాలకు తరలిస్తారని తెలిసింది.

> **గట్టి నిఘా**
>
> 'హవాలా' డబ్బు దోపిడీ చేయడంలో పేరుమోసిన శ్రీధరన్‌ను పట్టుకోవడం ఒకరోజుతో అయ్యేది కాదు. కొన్ని రోజుల పాటు పూర్తిస్థాయిలో నిఘా వేయాలి. అదే పద్ధతిలో పనిచేస్తున్నాం. దోపిడీల్లో ఆరితేరిన ఇతన్ని పట్టుకోవడానికి కేరళ పోలీసులూ సాయం చేస్తున్నారు. శ్రీధరన్‌ను అదుపులోకి తీసుకుంటే మరిన్ని కొత్త విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.
>
> – ఫక్కీరప్ప, ఎస్పీ

నేటి నుంచి 'వర్క్ టూ రూల్'

- జేఏసీ అమరావతి ఛైర్మన్ దివాకర్‌రావు వెల్లడి



మాట్లాడుతున్న దివాకర్‌రావు

అనంతపురం అర్బన్: ఉద్యోగుల న్యాయపరమైన డిమాండ్ల సాధనలో భాగంగా మంగళవారం నుంచి వర్క్ టూ రూల్ పాటించనున్నట్లు 'ఏపీ జేఏసీ అమరావతి' జిల్లా ఛైర్మన్ దివాకర్‌రావు పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఉదయం పది నుంచి సాయంత్రం 5.30 గంటల వరకూ మాత్రమే విధుల్లో ఉద్యోగులు ఉంటారన్నారు. అనంతపురంలోని ఆ శాఖ కార్యాలయంలో సంఘం ప్రధాన కార్యదర్శి పీఎస్ ఖాన్‌తో కలసి సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వానికి తామెప్పుడూ వ్యతిరేకం కాదని, ఎన్నడూ బ్లాక్‌మెయిల్ చేయలేదని గుర్తు చేశారు. కేవలం పీఆర్సీ, జీపీఎఫ్ విషయంలో తప్ప మరే విషయంలోనూ ప్రభుత్వ విధానాలను తప్పుబట్టడం లేదన్నారు. ఉద్యోగుల హక్కుల పరిరక్షణపైనే మాట్లాడుతున్నామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతున్నామన్నారు. ఆందోళనలో భాగంగానే ఈ నెల 9వ తేదీ నుంచి నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరవుతున్నామన్నారు. అదే క్రమంలో ఓట్ల లెక్కింపు రోజునా నల్ల బ్యాడ్జీలు ధరించామే తప్ప ఓటర్లను ప్రభావితం చేయడానికి కాదన్నారు.

బోధన.. వేదన

- జేఎన్‌టీయూ అనుబంధ ప్రైవేట్ కళాశాలల్లో అధ్యాపకుల కొరత
- అధునాతన కోర్సుల్లో ఆన్‌లైన్ పాఠాలకే పరిమితం
- పార్ట్‌టైం అధ్యాపకులతో నెట్టుకొస్తున్న వైనం



జేఎన్‌టీయూ అనంతపురం

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం అనుబంధ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలల్లోని ఎమర్జింగ్ కోర్సుల్లో అధ్యాపకుల కొరత వేధిస్తోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, బ్లాక్ చైన్ టెక్నాలజీ, డేటా సైన్సెస్, మెషిన్ లెర్నింగ్, బిగ్ డేటా వంటి కోర్సులను సింహభాగం ఇంజినీరింగ్ కళాశాలలు అమలు చేస్తున్నాయి. కంప్యూటర్ సైన్సెస్‌కు అనుబంధంగా ఉండే ఈ కోర్సులకు విపరీతమైన క్రేజీ. ఈ కోర్సుల్లో విద్యార్థులు అడ్మిషన్లకు ఆసక్తి చూపుతున్నారు. విద్యార్థుల నుంచి వస్తున్న డిమాండ్‌తో కళాశాలలు సీఎస్ఈ, ఎమర్జింగ్ కోర్సుల్లో సీట్లు పెంపుదలకు ఆసక్తి చూపిస్తున్నారు. పేరెన్నికగల బహుళజాతి సంస్థలు సైతం క్యాంపస్ ఇంటర్వ్యూల్లో కంప్యూటర్ సైన్సెస్ విద్యార్థులకు ఉద్యోగాలు కల్పిస్తున్నాయి. గత రెండు సంవత్సరాల నుంచి సీఎస్ఈ, ఎమర్జింగ్ కోర్సుల విద్యార్థులు ఉద్యోగావకాశాలు ఎక్కువగా దక్కుతున్నాయి.

అధ్యాపకులేరీ..?

కోర్సులు ప్రవేశపెడుతున్న ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలు అధ్యాపకుల భర్తీపై మాత్రం అలసత్వం ప్రదర్శిస్తున్నాయి. విద్యార్థుల నిష్పత్తికి అనుగుణంగా అధ్యాపకులు ఉండడం లేదు. జేఎన్‌టీయూ అనుబంధ కళాశాలల్లో 40 శాతం పైగా కొరత నెలకొంది. ఈసీఈ, ఈఈఈ బ్రాంచ్‌లకు చెందిన అధ్యాపకులతోనూ ఎమర్జింగ్ కోర్సుల్లో పాఠాలు చెప్పిస్తున్నారు. అర్హులైన అధ్యాపకులు తక్కువగా ఉన్నారని ఈసీఈ, ఈఈఈ, బ్రాంచ్‌ల వారితోనూ ఎమర్జింగ్ కోర్సులు చెప్పించేందుకు అనుమతి ఇవ్వాలని అనుబంధ ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యాలు ఏఐసీటీఈని అభ్యర్థించడమే ఇందుకు తార్కాణం. అయితే నిబంధనల ప్రకారం బీటెక్, ఎంటెక్ కోర్సుల్లో సంబంధిత కంప్యూటర్ సైన్సెస్ చదివిన వారితోనే బోధించాలి. ఎంటెక్ చదివినా అదనపు అర్హతకు ఎక్కువ జీతాలు వచ్చే పరిస్థితి లేకపోవడంతో బీటెక్‌తోనే చాలామంది ఉద్యోగాల్లో స్థిరపడిపోతున్నారు. అధ్యాపక వృత్తిలో వేతనాలు తక్కువ కావడంతో ఆసక్తి చూపకపోవడం, పీజీ చేయాలనుకునే వారిలో కొందరు విదేశాల్లో స్థిరపడుతుండడం కూడా అధ్యాపకుల కొరతకు కారణాలవుతున్నాయి.

54 ఇంజినీరింగ్ కళాశాలల్లో ఎమర్జింగ్ కోర్సులు..

జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలోని మొత్తం 54 ఇంజినీరింగ్ కళాశాలల్లో డేటా సైన్సెస్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, బిగ్ డేటా, డేటా సైన్సెస్, మెషిన్ లెర్నింగ్, బ్లాక్ చైన్ టెక్నాలజీ వంటి కోర్సులు నిర్వహిస్తున్నాయి. ఆన్‌లైన్ పాఠాలు చెప్పిస్తున్నాయి. కొన్ని కళాశాలలు, ఇతర విద్యాసంస్థల్లో పనిచేస్తున్న వారితోనూ ఆన్‌లైన్ పాఠాలు అందుబాటులోకి తెచ్చాయి. వారాంతాల్లో వీరు కళాశాలలకు వచ్చి విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తున్నారు. కొన్ని ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యాలు అధ్యాపకులకు సర్టిఫికెట్ కోర్సుల్లో శిక్షణ అందిస్తున్నాయి. సర్టిఫికెట్ కోర్సు పూర్తి చేసిన అధ్యాపకులు ఆయా సబ్జెక్టులను బోధించేందుకు ఏఐసీటీఈ అనుమతించడంతో ఈ మేరకు చర్యలు తీసుకుంటున్నారు. కొన్ని కళాశాలలు పార్ట్‌టైం అధ్యాపకులను నియమించుకుంటుండగా.. ఐఐటీ, నిట్, ట్రిపుల్ ఐటీ, ఇతర ప్రముఖ విద్యాసంస్థల్లో పదవీ విరమణ చేసిన వారిని అధ్యాపకులుగా నియమించుకుంటున్నాయి.

చర్యలు తీసుకుంటాం



ఎమర్జింగ్ కోర్సులకు అధిక ప్రాధాన్యత ఏర్పడింది. కాలానుగుణంగా వస్తున్న మార్పులకు దీటుగా కొత్త కోర్సుల అమలు అనివార్యం. కొత్త కోర్సుల బోధనకు అధ్యాపకుల భర్తీ తప్పనిసరి. 2023 -24 విద్యా సంవత్సరానికి అనుబంధ ఇంజినీరింగ్ కళాశాలల గుర్తింపుకు జారీ ప్రక్రియలో భాగంగా నిజనిర్ధారణ కమిటీల పర్యవేక్షణలో తప్పనిసరిగా పరిశీలిస్తాం. అధ్యాపకులు కొరత ఉంటే సంబంధిత కళాశాలలపై చర్యలు తీసుకుంటాం.

– జింకా రంగజనార్ధన, వీసీ, జేఎన్‌టీయూ(ఏ)

రాష్ట్ర చరిత్రలో ఇదో చీకటి రోజు

- జెడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ



బ్లాక్ డే ప్లకార్డ్ ప్రదర్శిస్తున్న జెడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ

అనంతపురం సిటీ: సభా సంప్రదాయాలను ఉల్లంఘించడంతో పాటు ఏకంగా సభాపతిపై దౌర్జన్యానికి దిగడం దురదృష్టకరమని, రాష్ట్ర చరిత్రలో ఇది చీకటి రోజని జెడ్పీ ఛైర్‌పర్సన్ గిరిజమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో సోమవారం చోటు చేసుకున్న పరిణామాలను ఆమె ఖండించారు. అనంతపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలు, రాష్ట్రాభివృద్ధికి సీఎం వైఎస్ జగన్ తీసుకున్న చొరవను చంద్రబాబుతో పాటు టీడీపీ ప్రజాప్రతినిధులు జీర్ణించుకోలేక పోతున్నారన్నారు. రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి భయం వెన్నాడుతుండడంతో అసెంబ్లీలో దిగజారుడు రాజకీయాలకు తెరలేపారని మండిపడ్డారు. సమస్యలను సభ దృష్టికి తీసుకెళ్లి, పరిష్కరించుకోవాలనే కనీస ఆలోచన కూడా లేని ఎమ్మెల్యేలుండడం టీడీపీ దౌర్భాగ్యమన్నారు. సభాపతి తమ్మినేని సీతారాం వద్దకెళ్లి ఆయన ముఖంపై ప్ల కార్డులను ప్రదర్శించడం, దళిత ఎమ్మెల్యే సుధాకర్‌పై దౌర్జన్యానికి దిగడం టీడీపీ ఎమ్మెల్యేల రౌడీయిజానికి పరాకాష్టగా అభివర్ణించారు. దీని వెనుక చంద్రబాబు హస్తముందని ఆరోపించారు. హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ సైతం పలు సందర్భాల్లో మహిళలను కించపరిచేలా మాట్లాడిన ఉదంతాలున్నాయన్నారు. జీఓ నంబర్-1 అన్ని రాజకీయ పార్టీలకు వర్తిస్తుందని, దీంతో టీడీపీకి ఎలాంటి నష్టముండదన్నారు. దీనిపై అనవసరంగా రాద్ధాంతం చేయడం తగదన్నారు. ఇరుకైన రోడ్లలో సభలు, యాత్రలు సాగిస్తుండడంతో అమాయక ప్రజలు మృత్యువాతపడుతున్నారని, ప్రజల ప్రాణాలు కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందనే విషయాన్ని మరవరాదన్నారు. ఇప్పటికైనా చంద్రబాబు, ఆయన ఎమ్మెల్యేలు రాష్ట్రాభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి తీసుకోవాల్సిన చర్యలపై సభాపక్షంగా సలహా, సూచనలు ఇస్తే బాగుంటుందన్నారు. సభా సంప్రదాయాలను పాటిస్తామని మాటివ్వడంతో పాటు సభకు, సభాపతికి, ఎమ్మెల్యే సుధాకర్‌కు చంద్రబాబు ఆయన ఎమ్మెల్యేలు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దశలవారీగా మద్యపాన నిషేధానికి సీఎం వైఎస్ జగన్ కట్టుబడి ఉన్నారన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దానాల్లోనూ 98 శాతం నెరవేర్చిన ఘనత కూడా సీఎం వైఎస్ జగన్‌దేనని గుర్తుంచుకోవాలన్నారు.

'బాబుకు బడుగులంటే చిన్నచూపు'



అసెంబ్లీలో మాట్లాడుతున్న మంత్రి ఉషశ్రీచరణ్

కళ్యాణదుర్గం: బడుగు బలహీన వర్గాలంటే టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబుకు చిన్నచూపని మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ విమర్శించారు. అసెంబ్లీ సమావేశంలో సోమవారం ఆమె మాట్లాడుతూ.. ప్రజాసమస్యల పరిష్కారంలో టీడీపీ నేతలకు చిత్తశుద్ధి లేదన్నారు. సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి సభలో అల్లర్లకు తెర లేపడమే ఇందుకు నిదర్శనమన్నారు. చంద్రబాబు కుట్ర మేరకే సభలో అల్లర్లకు పాల్పడతున్నారని విమర్శించారు. అసెంబ్లీ చరిత్రలో ఒక బీసీ స్పీకర్, ఒక దళిత ఎమ్మెల్యేపై టీడీపీ చిన్నచూపు చూడడం హేయమన్నారు. గతంలోనూ మాదిగ కులంలో ఎవరైనా పుట్టాలనుకుంటారా... బీసీల తోకలు కత్తిరిస్తా... అంటూ బడుగులపై చంద్రబాబు అక్కసు వెళ్లగక్కాడని గుర్తు చేశారు. రాష్ట్రంలో సాగుతున్న సంక్షేమ పాలన, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు రాజకీయ పదవుల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సముచిత స్థానం కల్పించడం తదితర అంశాలు గిట్టని చంద్రబాబు.. ఓ పథకం ప్రకారం దాడులను ప్రేరేపిస్తున్నారని మండిపడ్డారు. టీడీపీకి మూడు ఎమ్మెల్సీ సీట్లు వచ్చినంత మాత్రాన ఆ పార్టీ అధికారంలోకి వస్తుందనుకోవడం వారి భ్రమ అని అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో తొలి ప్రాధాన్యత ఓట్లు వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డికి అధికంగా వచ్చాయన్నారు. దీనిని బట్టి చూస్తే రాష్ట్ర ప్రజలు ఏ పార్టీ వైపు మొగ్గు చూపుతున్నారో అర్థమవుతుందన్నారు. జీఓ నంబర్1 పై రాద్ధాంతం చేయడం సరికాదని, ఈ జీఓ అన్ని రాజకీయ పార్టీలకు వర్తిస్తుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలని హితవు పలికారు.

గేట్స్ ఇంజనీరింగ్ కాలేజీకి జాతీయ అవార్డు



అవార్డును అందుకుంటున్న గేట్స్ కాలేజీ యాజమాన్యం

గుత్తి: విద్యా రంగం, సామాజాభివృద్ధికి చేసిన విశిష్ట సేవలను గుర్తించి గుత్తి గేట్స్ ఇంజనీరింగ్ కాలేజీకి జాతీయ అవార్డు దక్కింది. మానవ వనరుల మంత్రి శాఖ ఆధ్వర్యంలో ఢిల్లీలోని ఇండియా ఇంటర్నేషనల్ సెంటర్‌లో సోమవారం ప్రపంచ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గేట్స్ కాలేజీకి జాతీయ అవార్డు(బెస్ట్ పర్ఫార్మర్ ఆఫ్ ది ఇయర్ అవార్డు) ను ప్రదానం చేశారు. అవార్డును జాతీయ హక్కుల కమిషన్ అధికారుల నుంచి గేట్స్ కాలేజీ ఎండీ రఘునాథ్ రెడ్డి, డైరెక్టర్ వీకే వాణిలు అందుకున్నారు.

నలుగురు విద్యార్థుల డీబార్

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో సోమవారం నిర్వహించిన డిగ్రీ మొదటి, మూడో సెమిస్టర్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్న నలుగురు విద్యార్థులను డీబార్ చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ తెలిపారు. డీబార్ అయిన వారిలో అనంతపురంలో ఇద్దరు, గుత్తిలో ఒకరు, కదిరిలో ఓ విద్యార్థి ఉన్నారు.

'సీమ' ప్రజల ఆకాంక్షను నెరవేర్చాలి



నిరాహార దీక్షలో పాల్గొన్న న్యాయవాదులు

అనంతపురం: రాయలసీమ వాసుల చిరకాల ఆకాంక్షగా ఉన్న హైకోర్టు ఏర్పాటు సమగ్ర బిల్లును తక్షణమే అసెంబ్లీలో ప్రవేశపెట్టాలని అభివృద్ధి వికేంద్రీకరణ సాధన జేఏసీ జిల్లా కన్వీనర్ అలూరు రామిరెడ్డి, కో కన్వీనర్ సి.హనుమన్న కోరారు. సీమలో హైకోర్టు ఏర్పాటు చేయాలనే ప్రధాన డిమాండ్‌తో జిల్లా కోర్టు వద్ద సోమవారం ఒక్క రోజు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. పెద్ద ఎత్తున న్యాయవాదులు పాల్గొన్నారు. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లోనే న్యాయవివాదాలు లేని హైకోర్టు బిల్లును చట్టసభల్లో ప్రవేశపెట్టి ఆమోదం పొంది కేంద్రానికి నివేదించాలని కోరారు. దీక్షలో న్యాయవాదులు సి.హనుమన్న, ఎం.శివకుమార్, పి.అజీజ్, బాలాజీ నాయక్, పి.గిరిబాబు, రేవతి, పి.రీమా, టి.సాయి భరత్ పాల్గొన్నారు. కాగా, దీక్షలకు వైఎస్సార్‌సీపీ నాయకులు కేవీ రమణ, లీగల్ సెల్ అధ్యక్షుడు గాజుల ఉమాపతి, వీజే రవికుమార్, వెంకట్రాముడు, పోతులయ్య, సుబ్రహ్మణ్యం, కృష్ణప్ప, రంగనాయకులు, మురళీకృష్ణ సంఘీభావం తెలిపారు.

విద్యార్థిని ఆత్మహత్య



మృతురాలు షహీన

పామిడి: కడుపు నొప్పి తాళలేక ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. పామిడిలోని నాగిరెడ్డి కాలనీకి చెందిన హుస్సేన్‌బాషా, షాహిన్ దంపతలకు ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. గార్లదిన్నెలోని ఓ రైస్‌మిల్‌లో సూపర్‌వైజర్‌గా హుస్సేన్‌బాషా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న పెద్ద కుమార్తె షహీన (15) రుతుక్రమ సమయంలో తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతుండేది. దీంతో ఆమెకు తల్లిదండ్రులు చికిత్స చేయిస్తున్నారు. సోమవారం బంధువుల ఇంట అంత్యక్రియలు ఉండడంతో భార్యతో కలసి అనంతపురానికి హుస్సేన్‌బాషా వెళ్లాడు. ఆ సమయంలో పిల్లలు ముగ్గురూ పాఠశాలకు వెళ్లారు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో నెలసరి రుతుక్రమం రావడంతో కడుపునొప్పి భరించలేక విషయాన్ని ఫోన్ ద్వారా తల్లిదండ్రులకు షహీన వివరించింది. విషయాన్ని పాఠశాల హెచ్ఎం బేబీకి తండ్రి వివరించి, కుమార్తెను ఇంటికి పంపాలని కోరాడు. దీంతో ఇంటికి చేరుకున్న షహీనా కడుపు నొప్పి తాళలేక ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సాయంత్రం ఇంటికి చేరుకున్న కుటుంబసభ్యులు ఈ విషయాన్ని గుర్తించి బోరున విలపించారు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

రన్నింగ్ స్టాఫ్ సమస్యలు పరిష్కరించండి

గుంతకల్లు: రన్నింగ్ స్టాఫ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలంటూ దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ గుంతకల్లు డివిజన్ ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్, సహాయ కార్యదర్శులు మస్తాన్‌వలి, గౌస్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక రైల్వే స్టేషన్‌లోని క్రూ లాబీ ఆఫీస్ వద్ద మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాలో వారు మాట్లాడారు. రన్నింగ్ స్టాఫ్‌కి సెలవులు లేవని, విశ్రాంతి కూడా ఉండదని, సిక్ లీవ్‌లు అసలే లేవని గుర్తు చేశారు. అడ్మినిస్ట్రేషన్ పేరుతో రన్నింగ్ స్టాఫ్‌పై విధిస్తున్న ఆంక్షలను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. రన్నింగ్ స్టాఫ్‌పై కక్షధోరణి వీడి, సమస్యలు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రన్నింగ్ స్టాఫ్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే కార్మికుల నిరసన : గుత్తి: రైల్వే రన్నింగ్ స్టాఫ్ ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలంటూ గుత్తిలోని అన్ని రైల్వే లాబీల్లో దక్షిణ మధ్య రైల్వే రన్నింగ్ స్టాఫ్ బ్రాంచ్ ఆధ్వర్యంలో సోమవారం నిరసన వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులతో కలిసి అన్ని లాబీల్లో ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో రన్నింగ్ స్టాఫ్ సెక్రటరీ కె. శేఖర్ బాబు, దక్షిణ మధ్య రైల్వే ఏడీఎస్ నారాయణ, బ్రాంచ్ సెక్రటరీ రామాంజులరెడ్డి, నాయకులు సుధీర్, ఆచారి, జగదీష్, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్లుప్తంగా

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత

అనంతపురం క్రైం: అనారోగ్యంతో మృతి చెందిన ఓ కుటుంబానికి వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10,000 మొత్తాన్ని మృతుడి కుటుంబీకులకు కార్పొరేటర్ గురు శేఖర్‌బాబు మంగళవారం అందజేశారు. ఇటీవల 50వ డివిజన్‌లోని పెద్ద ముత్యాలమ్మ కాలనీకి చెందిన వడ్డే శ్రీనివాసులు (39) అనారోగ్యంతో మృతి చెందాడు. వైఎస్సార్ బీమా పథకంలో భాగంగా రూ.10 వేలను మృతుడి భార్య నాగమణికి అందజేశారు. మిగిలిన మొత్తం త్వరలో అందేలా చూస్తామని కార్పొరేటర్ పేర్కొన్నారు.

క్రీడల్లో రాణిస్తేనే గుర్తింపు



స్రవంతిని అభినందిస్తున్న పల్లె కృష్ణకిశోర్

అనంతపురం రూరల్: ఇటీవల జరిగిన ఆల్ ఇండియా సౌత్ జోన్ ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ విభాగం చదరంగం పోటీల్లో పీవీకేకే పాలిటెక్నిక్ విద్యార్థిని స్రవంతి ప్రథమ బహుమతి సాధించిందని ప్రిన్సిపాల్ వైభవ్ తెలిపారు. ప్రతిభ కనబరిచిన స్రవంతిని సోమవారం బాలాజీ విద్యా సంస్థల చైర్మన్ పల్లె కృష్ణ కిశోర్ అభినందించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తేనే గుర్తింపు లభిస్తుందన్నారు.

నేడు సింగమనేని స్మారక సమావేశం

అనంతపురం కల్చరల్: ప్రముఖ కథా రచయిత సింగమనేని నారాయణ వర్ధంతి సందర్భంగా మంగళవారం స్థానిక లలిత కళాపరిషత్తులో స్మారక సమావేశం జరగనుంది. సాయంత్రం 5 గంటలకు 'స్వతంత్ర గొంతుకలు–అణచివేత' అనే అంశంపై జరిగే కార్యక్రమానికి సీపీఎం అగ్రనేత బీవీ రాఘవులు విశిష్ట అతిథిగా హాజరవుతారని సింగమనేని నారాయణ స్మారక కమిటీ ప్రతినిధి డాక్టర్ ప్రగతి తెలిపారు.

సజావుగా వేలం

ఆత్మకూరు: పంపనూరులోని సర్వరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో సోమవారం కొబ్బరి చిప్పల సేకరణ హక్కులకు వేలం పాట నిర్వహించారు. వేలంలో మొత్తం 20 మంది పాల్గొనగా.. పంపనూరుకు చెందిన శ్రీకాంత్ అనే వ్యక్తి రూ.3,83,000లకు దక్కించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ అక్కిరెడ్డి , ఆలయ కమిటీ చైర్మన్ దుబ్బ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

కంప్యూటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

అనంతపురం సప్తగిరి సర్కిల్: ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ, యువకులకు రిటైల్, ట్యాలీ, కంప్యూటర్ స్కిల్స్‌లో ఉచితంగా శిక్షణ అందించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని అడ్మిషన్ కో–ఆర్డినేటర్ హరిప్రసాద్ తెలిపారు. 18 ఏళ్ల నుంచి 26 ఏళ్లలోపు ఉన్నవారు అర్హులన్నారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ (పాస్/ఫెయిల్) అయిన వారికి కడప పట్టణంలో కంప్యూటర్ స్కిల్స్, రిటైల్, ట్యాలీ కోర్సుల్లో 35 రోజుల పాటు శిక్షణ ఉంటుందన్నారు. వారికి ఉచితంగా వసతి, భోజన వసతి కల్పించడం జరుగుతుందన్నారు.మరిన్ని వివరాలకు 90004 87423 నంబరుకు సంప్రదించాలన్నారు.

30 నుంచి శ్రీరామనవమి ఉత్సవాలు

అనంతపురం కల్చరల్: మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో ఈనెల 30 నుంచి వచ్చే నెల 9 వరకూ శ్రీరామనవమి ఉత్సవాలు జరగనున్నాయి. సోమవారం ఆలయంలో శ్రీరామనవమి ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఆలయ ఈఓ సుధారాణి మాట్లాడుతూ.. పది రోజుల పాటూ ఉత్సవాలను వేడుకగా నిర్వహిస్తున్నామని ప్రతిరోజు వాహన సేవలు, సాంస్కృతిక సంబరాలు జరుగుతాయన్నారు. తొలిరోజు ధ్వజారోహణంతో ప్రారంభమయ్యే ఉత్సవాలు 5న సీతారామ కల్యాణం, 6న మడుగుతేరు, 7న శ్రీరామ పట్టాభిషేకం, 9న వసంతోత్సవంతో వేడుకలు ముగుస్తాయన్నారు.

భూ సర్వే పక్కాగా చేపట్టాలి

కనగానపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర భూ సర్వేను పక్కాగా నిర్వహించాలని తహసీల్దార్ పీ.వీ.రమణ సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం మండల కేంద్రంలోని రైతులతో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌జగనన్న శాశ్వత భూహక్కు–భూరక్ష కార్యక్రమంపై అవగాహన కల్పించారు. రెవెన్యూ రికార్డుల ప్రక్షాళన, భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం రీ–సర్వే కార్యక్రమాన్ని చేపట్టిందని వివరించారు. సమావేశంలో మండల సర్వేయర్ స్టీఫెన్, వీఆర్వో మారుతిప్రసాద్, సర్వేయర్లు పాల్గొన్నారు.

ఏకాగ్రతతో ఉత్తమ ఫలితాలు


ఆత్మకూరు: ఏకాగ్రతతో చదివితే అనుకున్న లక్ష్యాన్ని సాధించొచ్చని, వంద శాతం ఉత్తీర్ణత సాధిస్తామని ఎంఈఓ నరసింహారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక కేజీబీవీ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు సూచనలిచ్చారు. ప్రతి సబ్జెక్టుకు కొంత సమయం కేటాయించి ఏకాగ్రతతో చదవాలన్నారు. వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు.

అభివృద్ధి పథం

- అంబేడ్కర్ నగర్, మున్నానగర్ మురికివాడలకు మహర్దశ
- ఇప్పటికే రూ.55 లక్షలతో రోడ్లు, కాలువల ఏర్పాటు
- మరో రూ.70 లక్షలతో కొనసాగుతున్న పనులు



అంబేడ్కర్ నగర్‌లో రోడ్డు దుస్థితి (నాడు)



రూ.13 లక్షలతో సీసీ రోడ్డు నిర్మించిన దృశ్యం (నేడు)

ఈ ఫొటోలో కనిపిస్తున్న ప్రాంతం గతంలో మున్నానగర్‌లోని మురికివాడ. డ్రైనేజీ అస్తవ్యస్తంగా ఉండటంతో నిత్యం దోమలు, ఈగలు, దుర్వాసనతో స్థానిక ప్రజలు అవస్థలు పడ్డారు. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటోంది. కల్వర్టు, రోడ్డు నిర్మించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అనంతపురం క్రైం: గత టీడీపీ ప్రభుత్వంలో అభివృద్ధికి నోచుకుని మురికివాడలపై ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. కమర్షియల్ ప్రాంతాల తరహాలోనే మురికి వాడలను అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే 'అనంత' తలంచారు. అందులో భాగంగా నగరంలోని వివిధ మురికివాడల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంది వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం. సాధారణ నిధులు, 15వ ఆర్థిక సంఘం, గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిధులు (రూ.1.25 కోట్లు)తో 21వ డివిజన్‌లోని అంబేడ్కర్ నగర్, మున్నానగర్ రూపురేఖలు మార్చుతున్నారు. అందులో రూ.55 లక్షలతో అభివృద్ధి పనులు పూర్తికాగా.. మరో రూ.70 లక్షల పనులకు శ్రీకారం చుట్టారు.

ప్రణాళికాబద్ధంగా పనులు..

నగరపాలక సంస్థలోని పనిచేసే అధిక సంఖ్యలోని పారిశుధ్య కార్మికులు నగరంలోని అంబేడ్కర్ నగర్, మున్నానగర్‌లోనే అధికంగా నివసిస్తున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఈ ప్రాంతాల్లో ప్రజలకు సౌకర్యవంతమైన రోడ్లు, రోగాలు దరిచేరకుండా డ్రైనేజీ సిస్టమ్‌ను బలోపేతం చేసేందుకు ఎమ్మెల్యే అనంత, మేయర్ వసీం ఆదేశాలతో అధికారులు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారు.

ఎమ్మెల్యే చొరవతో అభివృద్ధి



గత పాలకుల నిర్లక్ష్యంతో నగరంలో ఏమాత్రం అభివృద్ధి జరగలేదు. పాలకవర్గం ఏర్పడిన రెండేళ్లలోనే పెద్ద ఎత్తున అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయి. ముఖ్యంగా ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి చొరవతో ఈ మురికివాడల ముఖచిత్రమే మారిపోయింది. డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తా.

– సాకే చంద్రలేఖ (21వ డివిజన్), కార్పొరేటర్

వైఎస్సార్ కుటుంబంతోనే మైనార్టీలకు న్యాయం

అనంతపురం క్రైం: వైఎస్సార్ కుటుంబంతోనే మైనార్టీలకు అన్ని విధాలా న్యాయం జరిగిందని వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్ పేర్కొన్నారు. టీడీపీ నేత లోకేష్ పాదయాత్రలో మైనార్టీల సంక్షేమంపై చేసిన వ్యాఖ్యలను సోమవారం ఓ ప్రకటనలో తప్పుబట్టారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ మైనార్టీలకు రిజర్వేషన్ కల్పించి, లక్షలాది మంది జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. ప్రస్తుతం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రెండు అడుగులు ముందుకు వేసి మైనార్టీల అభ్యున్నతికి మరింత కృషి చేశారన్నారు. కేవలం ఓటు బ్యాంకు కోసమే మైనార్టీలను టీడీపీ వాడుకుంటోందని ఆరోపించారు. మైనార్టీల గురించి మాట్లాడే అర్హత టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, ఆయన తనయుడు లోకేష్‌కు లేదన్నారు.

స్వయం శక్తితో ఎదగాలి



కుట్టు శిక్షణను ప్రారంభిస్తున్న బీసీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కుష్బూ కొఠారి

అనంతపురం రూరల్: విద్యార్థినులు స్వయం శక్తితో ఎదిగితేనే భవిష్యత్తులో సమస్యలను అధికమించవచ్చని బీసీ సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ కుష్బూకొఠారి అన్నారు. సోమవారం నగరంలోని బీసీ వసతి గృహంలో విద్యార్థినుల శిక్షణకు దాతలు సుందరపల్లి సురేష్ అందజేసిన కుట్టు మిషన్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పదిలో మంచి ఫలితాలు సాధించాలంటే సమయాన్ని వృథా చేయకుండా కష్టపడి చదవాలన్నారు. పరీక్షల సమయంలో ఉపాధ్యాయులు చెబుతున్న విషయాలను అర్థం చేసుకోవాలన్నారు. కష్టపడి చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఏబీసీడబ్ల్యూఓ సుభాషిణి, వార్డెన్లు పాల్గొన్నారు.

'అనంత'కు చేరిన సైకిల్ యాత్ర



దివ్యాంగుడు ప్రసాద్‌ను అభినందిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

అనంతపురం సిటీ: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదాతో పాటు విశాఖపట్నం రైల్వే జోన్ ప్రకటించాలనే డిమాండ్‌తో ఇచ్ఛాపురానికి చెందిన దివ్యాంగుడు నెయ్యల ప్రసాద్ మూడు చక్రాల బండిపై చేపట్టిన సైకిల్ యాత్ర 26 జిల్లాల మీదుగా సాగి సోమవారం రాత్రి అనంతపురానికి చేరుకుంది. విషయం తెలియగానే జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ నెయ్యల ప్రసాద్‌కు స్వాగతం పలికారు. శాలువా కప్పి సత్కరించి, ప్రశంసాపత్రాన్ని అందించారు. దివ్యాంగుడైనా.. గట్టి సంకల్పంతో చేపట్టిన యాత్ర రాష్ట్రంలోని అన్ని జిల్లాల మీదుగా సాగి అనంతపురానికి చేరడం గర్వంగా ఉందని గిరిజమ్మ ప్రశంసించారు. తన యాత్ర విజయవంతంగా సాగిందని.. ఇక ఢిల్లీకి వెళ్లి కేంద్ర ప్రభుత్వానికి వినతిపత్రం అందజేయనున్నట్లు నెయ్యల ప్రసాద్ తెలిపారు.

పన్ను వసూళ్లను వేగవంతం చేయాలి



ఆదిమూర్తినగర్‌లో సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న కమిషనర్ రమణారెడ్డి

అనంతపురం క్రైం: పెండింగ్‌లో ఉన్న పన్ను బకాయిలు వసూళ్లను వేగవంతం చేయాలని కమిషనర్ రమణారెడ్డి రెవెన్యూ, సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం నగరంలోని ఆదిమూర్తినగర్, ప్రకాష్ రోడ్డు, రాంనగర్ తదితర ప్రాంతాల్లో జరుగుతున్న స్పెషల్ డ్రైవ్‌ను పరిశీలించారు. ఏళ్ల తరబడి పన్ను చెల్లించని ప్రతి ఒక్కరినీ కలసి, ప్రభుత్వం అందించిన రాయితీని సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. పన్ను చెల్లింపులకు మరో 11 రోజుల మాత్రమే గడువు ఉందని తెలిపారు. బకాయిదారులు సకాలంలో పన్ను చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

రూ.80 లక్షల వసూలు

ప్రభుత్వం ఒకే సారి పన్ను చెల్లిస్తే వడ్డీ మాఫీ కల్పించడంతో బకాయిదారులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి పన్ను చెల్లిస్తున్నారు. సోమవారం ఒక్కరోజే రూ.80 లక్షల ఇంటి పన్ను చెల్లించారు. నగరపాలక సంస్థలోని కౌంటర్లు, పాతూరు, రాంనగర్, రెండో రోడ్డు సచివాలయాల్లో పన్ను చెల్లించేందుకు సిబ్బంది బారులు తీరారు.

కాలువల్లో పూడికను తీయాలి

కాలువల్లో ఎప్పటికప్పుడు పూడిక తీసి మురుగు సక్రమంగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ రమణారెడ్డి నగరపాలక సంస్థ సిబ్బందిని ఆదేశించారు. రాంనగర్‌లో డ్రైన్ బ్లాక్ అయ్యిందని స్థానిక కార్పొరేటర్ అనిల్‌కుమార్ రెడ్డికి సమస్య దృష్టికి తీసుకెళ్లారు. కమిషనర్ ఘటనా స్థలానికి వెళ్లారు. సంబంధిత డీఈ రాంప్రసాద్ రెడ్డి, ప్రజారోగ్యాధికారులకు పరిష్కార మార్గాలను చూడాలని ఆదేశించారు.

వేతనాలు ఇవ్వకుండా తప్పించుకు పోయాడు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ప్లాట్‌లను విక్రయిస్తే ఒక్కొక్కరికి రూ.10 వేలకు పైగా వేతనం ఇస్తామని చెప్పి, మోసం చేసిన రియల్ వ్యాపారి విజయ్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలని బాధిత యువతులు కోరారు. సోమవారం స్థానిక వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించి, న్యాయం చేయాలని ఎస్‌ఐ గౌస్‌కు ఫిర్యాదు చేశారు. వివరాలు ఇలా.. స్థానిక ఆర్టీసీ బస్టాండు సమీపంలోని చంద్రా హాస్పిటల్ వద్ద వీవీకే హౌసింగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో ఓ కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకున్న విజయ్‌కుమార్ నగర శివారు ప్రాంతాల్లోని పలు చోట్ల వెంచర్లు వేశారు. ప్లాట్లను విక్రయించేందుకు చాలా మంది యువతులను పనిలో పెట్టుకున్నాడు. ఒక్కొక్కరికి రూ.10 వేలకు పైగా వేతనం ఇస్తామని చెప్పడంతో చాలా మంది పనిలో చేరారు. కాగా నెలల తరబడి వారితో పని చేయించుకున్న విజయ్‌కుమార్ వేతనాలు ఇవ్వకుండా తప్పించుకుని వెళ్లిపోయాడు. బాధిత యువతులు నెల రోజుల క్రితమే వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించారు. కాగా పోలీసుల నుంచి గడువు కోరిన విజయ్‌కుమార్ మళ్లీ మొహం చాటేశాడు. ఎన్నిసార్లు ఫోన్ చేసినా మీకు నయాపైసా ఇచ్చేది లేదు. మీ ఇష్టం వచ్చింది చేసుకోండని బెదిరింపులకు దిగాడు. దీంతో బాధితులంతా కలసి వన్‌టౌన్ పోలీసులు మరోమారు ఆశ్రయించారు. ఫిర్యాదు స్వీకరించిన ఎస్‌ఐ గౌస్ సంబంధిత రియల్ వ్యాపారిపై కేసు నమోదు చేస్తామని తెలిపారు. విజయ్‌కుమార్‌ను పిలిపించి న్యాయం చేస్తామని ఎస్‌ఐ హామీ ఇచ్చారు.

విద్యుత్ శాఖ ఏఈ రవీంద్రపై వేటు



అనంతపురం టౌన్: విద్యుత్ శాఖ ఏఈ రవీంద్ర ప్రసాద్‌ను సస్పెండ్ చేస్తూ ఆ శాఖ ఎస్‌ఈ సురేంద్ర సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. అనంతపురంలోని 3వ డ్రిస్టిబ్యూషన్ సెక్షన్ ఏఈ గా పనిచేస్తున్న రవీంద్ర ప్రసాద్.. రాంనగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌కు ఎలాంటి ఎస్టిమేషన్ లేకుండానే ఏక కాలంలో ఎనిమిదికి పైగా విద్యుత్ సర్వీసులు మంజూరు చేశారు. విద్యుత్‌శాఖ విజిలెన్సు అధికారుల విచారణలో ఈ విషయం వెలుగు చూసింది. దీంతో ఉన్నతాధికారుల దృష్టికి ఈ విషయం తీసుకెళ్లడంతో ఏఈ రవీంద్రను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. కాగా, విద్యుత్ శాఖ నిబంధనల మేరకు ఐదు సర్వీసులు దాటితే ఎస్టిమేషన్ వేసి ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసుకున్న తర్వాతే సర్వీసులను మంజూరు చేయాల్సి ఉంది. ఇందుకు విరుద్ధంగా ఏఈ రవీంద్ర వ్యవహరించినట్లు తెలుస్తోంది.

ఇరువర్గాల ఘర్షణ

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: స్టార్ సిటీ స్కాన్ సెంటర్ నిర్వాహకుడు దాదాగాంధీ సోమవారం కారులో వెళుతుండగా.. కోవూరు నగర్‌కు చెందిన రవితేజ అనే యువకుడిపై వర్షపు నీరు పడటంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ ఘటన సోమవారం స్థానిక రహమత్ నగర్‌లో చోటుచేసుకుంది. యువకుడు దాదా గాంధీ కారును అడ్డుకుని గొడవకు దిగాడు. ఈ క్రమంలో ఒకరినొకరు వాదులాడుకున్నారు. దీంతో రవితేజపై దాదాగాంధీ టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా దాదాగాంధీ తన మనుషులతో వచ్చి దాడి చేశారని రవితేజ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ శివరాముడు తెలిపారు.

నోటి క్యాన్సర్‌పై అవగాహన కల్పించాలి



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ వీరబ్బాయి

అనంతపురం సప్తగిరి సర్కిల్: నోటి క్యాన్సర్ నివారణపై అవగాహన కల్పించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వీరబ్బాయి అన్నారు. సోమవారం స్థానిక జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయం వద్ద ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నోటి శుభ్రత, దంత దవన తదితర అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ స్వీయ ఆరోగ్యం కోసం శీతల పానీయాల వినియోగం తగ్గించాలన్నారు. ఆహారం తిన్న వెంటనే నోరు శుభ్రం చేసుకోవాలన్నారు. తీపి పదార్థాలను తక్కువగా తీసుకోవాలన్నారు. పొగాకు వాడకం, మత్తు పదార్థాలను సేవించడం మానుకోవాలన్నారు. అసంక్రమిత వ్యాధులు ఉన్న వారు మరింత జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ యుగంధర్, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ నారాయణ స్వామి, ఫ్యామిలీ ఫిజీషియన్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ సుజాత, ఏఓ ప్రభాకర్ మోజెస్, ఆంజనేయులు, ప్రేం, మౌనిక, శశికళ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

అనంతపురం సప్తగిరి సర్కిల్: జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఏఎన్‌ఎంల సమస్యలను పరిష్కరించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వీరబ్బాయికి ఏపీఎన్‌జీఓ సంఘం నాయకులు వినతిపత్రాన్ని అందించారు. స్థానిక జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ప్రధాన కార్యాలయంలో సోమవారం ఆయన్ను ఏఎన్‌ఎంలు కలిశారు. ఎదుర్కొంటున్న సమస్యలను విన్నవించారు. ఏఎన్‌ఎం కౌన్సెలింగ్‌కు సంబంధించి ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఎన్‌జీఓ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవ్, జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, కార్యదర్శి చంద్రమోహన్, మహిళ విభాగం చైర్‌పర్సన్ జమీలా బేగం, ఉపాధ్యక్షుడు రవికుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, రామ్మోహన్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో పాల్గొనండి



మాట్లాడుతున్న పీడీ వేణుగోపాలరెడ్డి

ఆత్మకూరు: జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ ఉపాధి పనుల్లో పాలుపంచుకునేలా చూడాలని, ప్రతి ఒక్కరికీ రూ.257కు తగ్గకుండా కూలి దక్కేలా చూడాలని ఉపాధి సిబ్బందిని డ్వామా పీడీ వేణుగోపాలరెడ్డి ఆదేశించారు. ఆత్మకూరు మండలం ముట్టాల వద్ద చేపట్టిన ఉపాధి పనులను సోమవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ వంద రోజుల పనిదినాలు పూర్తి చేయాలని సూచించారు. ఏప్రిల్ 1వ తేది నుంచి కొత్త పనులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. పూర్తి చేసిన పనులకు బిల్లులు త్వరగా కూలీల బ్యాంక్ ఖాతాలకు జమ అవుతుందన్నారు. కార్యక్రమంలో ఏపీడీ అనురాధ, ఏపీఓలు సుజాత, పుష్ప, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

987 మంది విద్యార్థుల గైర్హాజరు

రాప్తాడు రూరల్: ఉమ్మడి జిల్లాలో సోమవారం జరిగిన ఇంటర్ ఫస్టియర్ గణితం, బోటనీ, సివిక్స్ పరీక్షలకు 987 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. 99 కేంద్రాల్లో పరీక్షలు జరగ్గా.. 32,514 మంది విద్యార్థులకు గాను 31,527 మంది హాజరయ్యారు. వీరిలో జనరల్ గ్రూపుల్లో 29,891 మందికి గాను 29,039 మంది హాజరయ్యారు. ఒకేషనల్ గ్రూపుల్లో 2,623 మందికి గాను 2,488 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు.

దాడి హేయమైన చర్య



మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం క్రైం: అసెంబ్లీలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే సుధాకర్‌బాబుపై టీడీపీ ఎమ్మెల్యేలు దాడి చేయడం హేయమైన చర్య అని మేయర్ వసీం పేర్కొన్నారు. సోమవారం ఆయన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. అసెంబ్లీ సమావేశాలు జరిగినప్పటి నుంచి టీడీపీ ఎమ్మెల్యేలు దురుద్దేశంతో అలజడి వాతావరణం సృష్టించి.. అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఇప్పుడు భరి తెగించి ఎమ్మెల్యేపై దాడికి పాల్పడ్డారన్నారు. టీడీపీ మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి మాత్రం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే దాడి చేసినట్లు మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. టీడీపీ అరాచకాలకు ప్రజలు మరోసారి బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఇషాక్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఖాజా, మధు పాల్గొన్నారు.

దళితులంటే అక్కసు

టీడీపీ నేతలకు దళితులంటే అక్కసు అని ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎగ్గుల శ్రీనివాసులు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అసెంబ్లీలో టీడీపీ ఎమ్మెల్యేల తీరును తప్పుబట్టారు. దళిత ఎమ్మెల్యే సుధాకర్ బాబుపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మరోసారి ఇలాంటి పరిస్థితి తలెత్తకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా స్పీకర్ తమ్మినేని సీతారాంపై పేపర్లు చించి విసరడాన్ని తప్పుబట్టారు.

ఏపీ ఐసెట్ కార్యాలయం ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న వీసీ ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణా రెడ్డి

అనంతపురం: ఏపీ ఐసెట్ (2023)ను తొలిసారిగా శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఏపీ ఐసెట్ రాష్ట్ర చైర్మన్‌గా ఎస్కేయూ వీసీ ప్రొఫెసర్ మాచిరెడ్డి రామకృష్ణా రెడ్డి, ఏపీ ఐసెట్ రాష్ట్ర కన్వీనర్‌గా ప్రొఫెసర్ పి.మురళీకృష్ణ వ్యవహరిస్తున్నారు. ఏపీ ఐసెట్ కార్యక్రమాల నిర్వహణకు ఎస్కేయూలో సోమవారం కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. ఏపీ ఐసెట్‌ను పకడ్బందీగా నిర్వహించి వర్సిటీ ఖ్యాతిని పెంచాలన్నారు. కార్యక్రమంలో ఎస్కేయూ రెక్టార్ ప్రొఫెసర్ ఏ.మల్లికార్జున రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య, ఏపీ ఐసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ పి. మురళీకృష్ణ పాల్గొన్నారు.

జాతీయ సమైక్యతా శిబిరానికి ఎంపిక

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయానికి చెందిన ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పది మంది జాతీయ సమైక్యాత శిబిరానికి ఎంపికయ్యారు. మంగళవారం నుంచి ఈనెల 27 వరకూ కర్ణాటక రాష్ట్రం గదక్‌లో జరగనున్న సమైక్యాత శిబిరానికి ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు గౌస్, ఆజాం, శేఖర్, ఖాదర్‌బాషా, వాసవి, లావణ్య, నందిత, సుచిత్ర, పూజిత, సాయి నివాస్, వీరబాబు ఎంపికయ్యారు. ఈ బృందానికి ఇన్‌చార్జ్‌గా ఎన్‌ఎస్‌ఎస్ పీఓ డాక్టర్ చాగంటి రామిరెడ్డి వ్యవహరిస్తారు. మన రాష్ట్ర ఆచార, వ్యవహారాలు, కళలు, సంస్కృతి, సంప్రదాయాలను అక్కడ ప్రదర్శించనున్నట్లు పీఓ రామిరెడ్డి తెలిపారు.

మాన్యాన్ని రికార్డుల్లోకి ఎక్కించాలి

రాప్తాడు: ఓ మాజీ నక్సలైట్ నుంచి ఆంజనేయ స్వామి మాన్యాన్ని కాపాడాలని హంపాపురం గ్రామస్తులు సోమవారం తహసీల్దార్ లక్ష్మీ నరసింహులుకు వినతిపత్రం ఇచ్చారు. హంపాపురంలో సర్వే నెంబర్ 226–1లో 3–43, 226–2లో 19 సెంట్లు మొత్తం 3.62 ఎకరాల భూమి పూర్వ కాలం నుంచి యలమకూరి ఆంజనేయ స్వామి పేరున ఉందన్నారు. కూడేరు మండలానికి చెందిన మాజీ నక్సలైట్ నాగరాజు అలియాస్ యల్లన్న తన పేరున సర్వే నెంబర్ 226–3లో 3.08 సెంట్లు పట్టా తెచ్చుకున్నట్లు తెలిపారు. దేవుడి మాన్యాన్ని కబ్జా చేసేందుకు మాజీ నక్సలైటు ప్రయత్నిస్తున్నాడని చెప్పారు. డైక్లాట్‌ను పరిశీలించి రికార్డుల్లో మిగులు భూమి కింద ఉన్న భూమిని కాపాడాలన్నారు.

'స్పందన'లో 55 వినతులు



అర్జీలు స్వీకరిస్తున్న సిబ్బంది

అనంతపురం అర్బన్: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో సోమవారం కలెక్టరేట్‌లో 'స్పందన' రద్దు చేసినప్పటికీ ప్రజలు వివిధ ప్రాంతాల నుంచి తమ సమస్యలు విన్నవించుకునేందుకు వచ్చారు. దీంతో అధికారులు కార్యాలయ ఆవరణలో ప్రత్యేకంగా కౌంటర్ ఏర్పాటు చేయించి, సిబ్బందిని అందుబాటులో ఉంచారు. వారు ప్రజల నుంచి 55 అర్జీలు స్వీకరించారు. అర్జీలను పరిష్కారం కోసం ఆన్‌లైన్ ద్వారా సంబంధిత శాఖలకు పంపిస్తామని డీఆర్‌ఓ గాయత్రీదేవి తెలిపారు.

పోలీసు స్పందనకు 81 వినతులు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీసు స్పందన కార్యక్రమానికి వివిధ సమస్యలపై 81 వినతులు అందాయి. ఎస్పీ డాక్టర్ ఫక్కీరప్ప స్వయంగా అర్జీదారులతో మమేకమై వినతులు స్వీకరించి, సమస్య తీవ్రతపై ఆరా తీశారు. చట్ట పరిధిలో ఉన్న సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలంటూ సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఆదేశించారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించబోమని సిబ్బందిని హెచ్చరించారు. అదనపు ఎస్పీ హనుమంతు పాల్గొన్నారు.

చైతన్య స్కూల్‌లో 'ఫేర్‌వెల్' సందడి



పాఠశాల యాజమాన్యంతో పదో తరగతి విద్యార్థులు

రాప్తాడురూరల్: అనంతపురం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని చైతన్య ఇంగ్లిష్ మీడియం పాఠశాల పదో తరగతి విద్యార్థులు ఫేర్‌వెల్ వేడుకలను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. మూడో రోడ్డులోని జీఆర్ ఫంక్షన్ హాల్‌లో ప్రిన్సిపల్ పర్వీన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఏజీఎం సుబ్బారెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. పదో తరగతి విద్యార్థులు ఎలాంటి మానసిక ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాయాలని సూచించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో చైతన్య పాఠశాల డీన్ చంద్రమోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితే ఉజ్వల భవిత



డ్యాన్స్ చేస్తున్న చిన్నారులు

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ పరిధిలోని సియోనుపురంలోని జోర్డాన్ ప్రైవేట్ పాఠశాల వార్షికోత్సవం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. విద్యార్థులు అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుని, బాగా చదివి ప్రయోజకులు కావాలని సూచించారు. తల్లిదండ్రులు, స్కూలుకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం కరస్పాండెంట్ జె.విక్టర్‌బాబు ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు అలనాటి పాత పాటలకు స్టెప్పులతో అదరగొట్టారు.